నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 13 నవంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

అధికారుల తీరుపై గరంగరం

- పత్తి యార్డులో కలియతిరిగి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్
- ఇష్టారీతిన పత్తి కొనుగోలు చేసిన వ్యాపారులపై చర్యలకు ఆదేశం

ఖమ్మం పత్తి యార్డులో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 12 : సీసీఐ మద్దతు ధర క్వింటా రూ.7,521 పలుకుతుండగా.. 9 శాతం తేమ కలిగిన పంటను రూ.6,900 చొప్పున కొనుగోలు చేయడం, అక్కడున్న మార్కెటింగ్ శాఖ అధికారులు ఏమీ పట్టించుకోకపోవడంపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలో గల పత్తి యార్డును కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీంతో కలిసి పత్తి యార్డు మొదటి గేట్ నుంచి ఈ బిడ్డింగ్ కార్యాలయం వరకు కలియ తిరుగుతూ రైతులు విక్రయానికి తెచ్చిన పంటను పరిశీలించారు. చేతితో, తేమ శాతం నిర్ధారణ యంత్రంతో పత్తిని పరిశీలించడంతోపాటు రైతులతో మాట్లాడారు. ఏ గ్రామం నుంచి పంట తీసుకొచ్చారు? ఎంత మొత్తం తెచ్చారు? ఈ రోజు ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో ధర ఎంత పలికింది? తేమ శాతం నిర్ధారణ జరుగుతుందా? అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, డీఎంవోలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ఉద్యోగాలు ఊడిపోతాయన్నారు. వారం క్రితం నుంచి పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలని ఆదేశించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. 14లోపు తేమ శాతం కలిగిన పత్తికి వ్యాపారులు ఇష్టారీతిన ధర పెడుతున్నారని, తేమ నిర్ధారణ కాకుండా కొనుగోళ్లు ఎలా చేస్తున్నారని మండిపడ్డారు. సత్వరమే సదరు వ్యాపారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ మార్కెట్లో సైతం తేమ శాతం నిర్ధారణకు అనుగుణంగా ధరలు ఉండాలన్నారు. మార్కెట్‌లో బ్రోకర్లకు తావు లేదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పత్తి రైతుల మొర

కాగా.. వ్యవసాయ మార్కెట్ సందర్శనకు వచ్చిన కలెక్టర్‌కు.. పలువురు రైతులు సమస్యలపై మొరపెట్టుకున్నారు. సీజన్ ప్రారంభం నుంచి మంచి, చెడు పత్తి అనే తేడా లేకుండా వారి నోటికి ఎంత ధర వస్తే అంతకు కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధర క్వింటాకు రూ.7,521 ఉన్నా.. కనీసం రూ.7 వేలకు కొన్న నాథుడే మార్కెట్లో లేడన్నారు. దయచేసి మీరు అప్పుడప్పుడు మార్కెట్‌ను సందర్శించాలని, మీరు ఉంటేనే మాకు మంచి ధర పెడుతారని రైతులు చెప్పుకొచ్చారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారీతిన ధరలు పెడుతున్నారని వాపోయారు.

లాభాల 'మునగ'పై దృష్టి పెట్టండి

- ఏడు నెలల కాలంలోనే చేతికొచ్చే పంట
- అవగాహన కార్యక్రమంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

చండ్రుగొండ రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

చండ్రుగొండ, నవంబర్ 12 : అధిక లాభాలొచ్చే మునగ సాగు వైపు రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాలకు చెందిన రైతులకు మంగళవారం మునగ సాగుపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ మునగ సాగు చేసే రైతులకు ఉపాధిహామీ పథకం కింద నూటికి నూరు శాతం సబ్సిడీ వస్తుందని, ఎకరానికి రూ.1.20 లక్షల చొప్పున ఉచితంగా అందజేస్తుందన్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న మునగ సాగుపై మక్కువ పెంచుకోవాలని, ఏడు నెలల కాలంలోనే పంట చేతికొస్తుందన్నారు. అధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. పంటపై పెట్టిన పెట్టుబడి మొత్తం ఉపాధిహామీ పథకంలో వస్తుందని, లాభాలు మాత్రం రైతులకు వస్తాయన్నారు. రైతులు నిర్భయంగా మునగ సాగు చేసుకోవచ్చని, రిటేల్‌గా కొనుగోలు చేసేందుకు వ్యాపారులే తోటల వద్దకు వస్తారన్నారు. ఈ సందర్భంగా సాగు రైతుల అనుమానాలను కలెక్టర్ నివృత్తి చేశారు. సమావేశంలో డీఆర్‌డీవో విద్యాలత, ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ సంధ్యారాణి, ఏవోలు వినయ్, అనూష, ఏపీఎం సంతోశ్, ఏపీవోలు శ్రీను, ప్రమీల, ఏఈవోలు, పీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, మునగ రైతులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే ఉద్యమిస్తాం..

- పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు సడలించాలి
- అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం డిమాండ్

సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఖమ్మం రూరల్, నవంబర్ 12 : పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బంది పెడితే ఉద్యమిస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం అచ్చయ్య హెచ్చరించారు. పొన్నెకల్, గుర్రాలపాడు గ్రామాల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను సంఘం నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పత్తి విక్రయానికి తీసుకొచ్చిన రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అచ్చయ్య మాట్లాడుతూ భారత పత్తి సంస్థ(సీసీఐ) నామమాత్రంగా కొనుగోళ్లు చేపట్టడంతో చాలా మంది రైతులు నష్టపోతున్నారని, వెంటనే నిబంధనలు సడలించి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు తీసుకొచ్చిన పత్తిని సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీసీఐ బయ్యర్ అవినాశ్‌కు రైతుల సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మలీదు నాగేశ్వరరావు, అవుల వెంకటేశ్వర్లు, కోలేటి నాగేశ్వరరావు, కేలోత్ లక్ష్మణ్, బందెల వెంకయ్య, మారుతి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

సర్వేను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, నవంబర్ 12 : కులగణన సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. పట్టణంలోని గొల్లబజార్‌లో చేపట్టిన కులగణన సర్వేను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. వివరాల సేకరణలో ఇబ్బందులు కలుగుతున్నాయా.. అని ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులుంటే సూపర్‌వైజర్లకు, ప్రత్యేక అధికారుల దృష్టికి తేవాలన్నారు. సర్వే సందర్భంగా 6 నుంచి 8వ తేదీ వరకు ఇంటింటికీ స్టిక్కరింగ్ వేశారని, శనివారం నుంచి ప్రభుత్వం నిర్దేశించిన సర్వే ఫారంలో ప్రతి కుటుంబం నుంచి వివరాలు సేకరించి నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ కేటాయించిన కేంద్రాల్లో డేటా ఎంట్రీ సిబ్బందితో పాటు లేకుండా ఆన్‌లైన్‌లో నిర్దిష్ట సమయంలో నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

- డీఎంహెచ్‌వో కళావతిబాయి
- ముస్తఫానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

యూహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మం సిటీ, నవంబర్ 12 : వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి హెచ్చరించారు. ఖమ్మం నగరంలోని ముస్తఫా నగర్‌లో గల అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ, సిబ్బంది పనితీరు, రికార్డులు, బయోమెట్రిక్ హాజరు, ఫార్మసీ, ల్యాబ్, స్టోర్ రూములతోపాటు ఓపీ, ఐపీ రిజిస్టర్లను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయకపోవడం, ప్రస్తుత స్టాక్, ఖర్చు విషయంలో తేడాలను గమనించి పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. మరోసారి తనిఖీకి వస్తానని, అప్పటివరకు అన్నీ సక్రమంగా లేనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రోజువారీగా మందుల పట్టికను బోర్డుపై ప్రదర్శించాలన్నారు. వైద్యారోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసి ప్రజల్లో నమ్మకం పెంచాలని ఆమె సూచించారు.

కుటుంబ సర్వేలో ఉన్న ఉపాధ్యాయురాలు

నాస్‌పై సర్వే ఎఫెక్ట్

విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) ఫలితాలపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎఫెక్ట్ పడుతున్నది. కుటుంబ సర్వే కోసం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు విధులు కేటాయించింది. ఇందుకు మధ్యాహ్నం నుంచి పాఠశాలలకు సెలవు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సర్వేలో పాల్గొంటున్నారు. ఒంటిపూట బడులు ఇవ్వడంతో విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ఫలితంగా విద్యార్థుల సామర్థ్యాల పెంపు కోసం మధ్యాహ్నం నుంచి ఉపాధ్యాయులు ఇచ్చే శిక్షణకు పూర్తి ఆటంకం కలుగుతోంది. ముఖ్యంగా 3వ తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

- అశ్వారావుపేట, నవంబర్ 12

- ఉపాధ్యాయులను 'కుటుంబ సర్వే'లో తిప్పుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఒంటిపూట బడులతో విద్యార్థులు ఇంటిదారి
- నీరుగారుతున్న 'నాస్' లక్ష్యం
- విద్యా ప్రమాణాల పెంపునకు ఆటంకం
- 3వ తరగతి విద్యార్థులపై తీవ్రప్రభావం

విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ విద్య శిక్షణ, రీసర్చ్ మండలి కలిసి నాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)ను నిర్వహిస్తున్నది. మొదటి సారి 2021లో నాస్ సర్వే నిర్వహించి ఆయా ఫలితాల ఆధారంగా విద్యా విధానంలో తీసుకురావాల్సిన మార్పుల గురించి మండలి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొవిడ్ అనంతరం దేశవ్యాప్తంగా జరిపే అతిపెద్ద ప్రతిష్టాత్మక విద్యా సర్వే నాస్-2024. ఈ సర్వేను 3, 6, 9 తరగతులకు డిసెంబర్ 2024న నిర్వహించాలని నిర్ణయించారు.

నాస్ లక్ష్యం..

విద్యార్థుల్లో భాష, గణితంలో కనీస విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'నాస్' అమలు చేస్తున్నది. ఈ సర్వే ద్వారా వచ్చిన ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు తర్ఫీదునిస్తారు. ఇందుకోసం ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఉంటుంది. ఉపాధ్యాయులు ఉదయం సబ్జెక్టులు బోధించి.. మధ్యాహ్నం తర్వాత నాస్ మూల్యంకనంపై శిక్షణనిస్తారు. కానీ.. కుటుంబ సర్వేకు నాస్ తీవ్ర ఆటంకంగా మారింది.

3వ తరగతి విద్యార్థులకు తీరని నష్టం

రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వే కోసం ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు విధులు కేటాయించడంతో నాస్ పరిధిలోని 3వ తరగతి విద్యార్థులు పూర్తిగా నష్టపోతున్నారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నాస్ ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ప్రాథమిక పాఠశాలల్లోనే 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు బోధన అందిస్తారు. తర్వాత ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1 నుంచి 7 తరగతుల విద్యార్థులు ఉంటారు. అంటే.. ప్రాథమిక పాఠశాలల్లో 3వ తరగతి విద్యార్థులతోపాటు ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న 6వ తరగతి విద్యార్థులూ నాస్ శిక్షణకు దూరమవుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న 3, 6 తరగతుల విద్యార్థులపైనే అచీవ్‌మెంట్ ఫలితాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

డిసెంబర్ సర్వేకు ఉపాధ్యాయులు దూరం

జాతీయస్థాయిలో జరిగే నాస్ సర్వే డిసెంబర్ రెండో వారంలో ఉండొచ్చని ఉపాధ్యాయ సంఘాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే నాస్-2024 సర్వే కోసం విద్యార్థులకు సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో మాదిరి పరీక్షలు నిర్వహించారు. వీటి ఫలితాల ఆధారంగా ప్రత్యేక శిక్షణనిస్తారు. కానీ.. నవంబర్ నుంచి డిసెంబర్ రెండో వారం వరకు విద్యార్థులకు ఇవ్వాల్సిన శిక్షణకు ఉపాధ్యాయులను ఇంటింటి సర్వే దూరం చేసింది. గతంలో తీసుకున్న తర్ఫీదును విద్యార్థులు మర్చిపోయే అవకాశాలు ఉన్నాయి. కుటుంబ సర్వే విద్యార్థుల నాస్ ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపించనున్నదని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నాస్‌లో ఆశించిన ఫలితాలు రాకుంటే ఉపాధ్యాయులపైనా ప్రభావం పడుతుందని వారు కలత చెందుతున్నారు.

నవంబర్ 17న రెండు సెషన్లు, 18న ఉదయం పరీక్ష

జిల్లాలో 87 పరీక్షా కేంద్రాలు

హాజరుకానున్న 27,984 మంది అభ్యర్థులు

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

కేంద్రాల వద్ద వసతులు ఏర్పాటు చేయాలి

అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, నవంబర్ 12 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసి, కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై వారు సమీక్షించారు. మండలాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సన్న, దొడ్డు రకాల కొనుగోళ్లకు ఎన్ని కేంద్రాలు, కేంద్రాలకు సరిపోను స్థల లభ్యత, వసతులు, పరికరాలు ఎన్ని ఉన్నవి, ధాన్యం కొనుగోలుకు వస్తుందా, సమస్యలు ఉన్నాయా అని అదనపు కలెక్టర్లు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 2,88,888 ఎకరాల్లో వరి సాగు చేయగా 6,64,444 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా ఉన్నట్లు వారు తెలిపారు. మొత్తం 324 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 31,008 ఎకరాల్లో వరికోతలు జరగగా, 25,672 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం 24గంటల లోపు సంబంధిత మిల్లుకు రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు అందుబాటులో ఉండాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

'గ్రూప్-3'కి పకడ్బందీ ఏర్పాట్లు

మామిళ్లగూడెం, నవంబర్ 12 : జిల్లాలో గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి టీజీపీఎస్‌సీ గ్రూప్-3 పరీక్షల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాల ప్రకారం.. నవంబర్ 17న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో, నవంబర్ 18న గ్రూప్ 3 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పక్కాగా జరగాలన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 27,984 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, వీరికి 87 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. కమిషన్ సూచనల మేరకు విజయ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ఎస్‌బీఐటీ కళాశాల ప్రిన్సిపాళ్లను రీజినల్ కో ఆర్డినేటర్లుగా నియమించామని తెలిపారు. ప్రశ్నాపత్రాలు అన్నింటినీ ఓల్డ్ ట్రెజరీలో భద్రపరుస్తున్నామని, ప్రతి 3 నుంచి 5 పరీక్షా కేంద్రాలకు తహసీల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో ఎం.రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, పరీక్షల కో-అర్డినేటర్లు, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉషు పోటీల్లో మనోళ్ల సత్తా

ఉషు పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

ఖమ్మం సిటీ, నవంబర్ 12 : రాష్ట్రస్థాయి ఉషు చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. రంగారెడ్డి జిల్లా భవిష్య స్కూల్‌లో ఈ నెల 10వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్-12, అండర్-14 విభాగాల్లో నగరానికి చెందిన 14 మంది బాలబాలికలు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. వీరిలో టీ సాయి భవిష్యశ్రీ(గోల్డ్), డీ నరేన్(గోల్డ్), జే ప్రహర్షన్ పాల్(గోల్డ్), వై రిత్విక్(గోల్డ్), జీ చక్రధర్ ఆర్యన్(సిల్వర్), వై.సుశాంత్(సిల్వర్), డీ హర్షిణి(బ్రాంజ్), కే యజ్ఞసేన(బ్రాంజ్), ఎండీ అబ్బాస్ గోరి(బ్రాంజ్), కే ప్రణవ్(బ్రాంజ్) మెడల్స్ గెల్చుకున్నారు. ఆయా విభాగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను, ఉషు కోచ్ పి.పరిపూర్ణాచారిలను జిల్లా యువజన, క్రీడల అధికారి టి.సునీల్‌రెడ్డి మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచి రామాలయంలో డిజిటల్ సేవలు

భద్రాచలం, నవంబర్ 12 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి డిజిటల్ సేవలు ప్రారంభించనున్నట్లు ఆలయ ఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:10 గంటల నుంచి డిజిటల్ సేవలు(అన్నదానం, ప్రొటోకాల్, వస్త్ర సమర్పణ) ద్వారా అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి సేవలో పాల్గొనే భక్తులకు వారి ఫొటో ద్వారా అన్నదానం స్వీకరించే నిమిత్తం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు టోకెన్ పొంది అన్నప్రసాదం అందించే విధంగా సేవలు ఉంటాయని తెలిపారు. ప్రొటోకాల్ దర్శనం కావాల్సిన వారు ప్రొటోకాల్ ఆఫీస్‌లో డిజిటల్ సేవ ద్వారా వివరాలు నమోదు చేయించుకుని దేవస్థానం వారు ఇచ్చే టోకెన్ ద్వారా స్వామివారిని దర్శించుకునే వీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే భక్తులు సమర్పించే వివిధ వస్త్రాలను బార్ కోడ్ ద్వారా డిజిటలైజేషన్ చేస్తారని తెలిపారు. ఎడ్లపల్లికి చెందిన ఆత్రేయ ఇన్ఫోటెక్ సిస్టమ్స్ ద్వారా డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తాయని, ఈ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు.

హామీలు అదుపు తప్పడంతోనే ప్రజా తిరుగుబాటు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

రేగా కాంతారావు

మణుగూరు టౌన్, నవంబర్ 12: కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు అదుపుతప్పడంతోనే ప్రజా తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకుల చిల్లర మాటలకు కొడంగల్‌లో అధికారులు బలయ్యారని.. ఇక మిగిలింది నాయకులేనన్నారు. గతంలో చిన రాయిగూడెం గోదావరి నదిపై బ్రిడ్జికి వంద కోట్లు.. ఇప్పుడు రోడ్లకు మంజూరు చేసిన వంద కోట్లు రద్దు చేసినందుకు ఆయా గ్రామాల ప్రజలు తిరగబడడం ఖాయమని జోస్యం చెప్పారు. ఇండ్లు అలకంగనే పండుగ కాదు.. ముందుంది ముసళ్ల పండుగ అని, ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే జనాలు మిమ్మల్ని పరుగెత్తించడం ఖాయమని పేర్కొన్నారు.

మత్స్య సంపదతో ఆర్థిక భరోసా..

జిల్లా మత్స్య శాఖ అధికారి ఇంతియాజ్

చేపపిల్లలను చెరువులో వదులుతున్న ఎంపీడీవో

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 12: పదేళ్ల నుంచి మత్స్య శాఖ ఆధ్వర్యంలో మత్స్య కారులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని జిల్లా మత్స్య శాఖ అధికారి మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం పట్టణ సమీపంలోని వెంకమ్మ చెరువు మత్స్యకారులకు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌తో కలిసి చేప పిల్లలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని తొమ్మిది చెరువులకు 5,40,750 చేపపిల్లను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. వెంకమ్మ చెరువు మత్స్యకారులకు 3,33,750 వివిధ రకాల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రసాదరావు, ఫీల్డ్ ఆఫీసర్ కోటేశ్వరరావుతో పాటు మత్స్య కారులు పాల్గొన్నారు.